గౌరవనీయులైన లోకాయుక్త గారి సమక్షములో

శుక్రవారము, నవంబరు 14, 2003

న్యాయమూర్తులు : శ్రీ ఆర్.రామానుజంగారు, లోకాయుక్త

ఫిర్యాదునంబరు : 1158/2003/బి1

శ్రీ జె.కొండలరావు,
తండ్రి వెంకయ్య,
గురజాడ గ్రామము,
పమిడి ముక్కల మండలము,
కృష్ణాజిల్లా, .. ఫిర్యాది

మరియు

1) మండల రెవెన్యూ అధికారి,
పమిడిముక్కల మండలము,

2) రెవెన్యూ ఇన్స్పెక్టరు,
పమిడిముక్కల మండలము,

3) సెక్రెటరీ,
గురజాడ గ్రామము,

4) శ్రీ ఆర్.గురవయ్య,
గురజాడ పోస్టు,
పమిడిముక్కల మండలము,
కృష్ణాజిల్లా,

5) కె.మాధవి,
గురజాడపోస్టు,
పమిడిముక్కల మండలము,
కృష్ణాజిల్లా .. ఆరోపణలు చేయబడిన వారు

..

ఉత్తరువు:

కృష్ణాజిల్లా, పమిడి ముక్కల మండలం, గురజాడ గ్రామము నుండి శ్రీ జె.కొండలరావు ఈ ఫిర్యాదును పంపినారు.

ఫిర్యాదులోని విషయములు ఈ క్రిందివిధముగా ఉన్నాయి:

11-7-2003 నాటి రాత్రి పది గంటలకు రాష్ట్రప్రభుత్వం వివిధ పథకాల కొరకు కేటాయించిన కరువు బియ్యమును అక్రమముగా తరలించుచున్న లారీని ఫిర్యాదీ గ్రామ పొలిమేరలో వున్న రామన్న చెరువు వద్ద ఫిర్యాదీ అడ్డగించి, ఆపి, ప్రజలకు తెలియ చేసినాడు. అక్రమముగా తరలించుచున్న 141 బస్తాల బియ్యాన్ని బినామీ పేరుతో డిపోను నిర్వహిస్తున్న శ్రీ ఆర్.గురవయ్య ఫిర్యాదీని మరియు యితరులను చూచి పారిపోయినాడు. ఈ విషయాన్ని గ్రామకార్యదర్శి దృష్టికి తెచ్చుటకు ప్రయత్నించినారు.

అతను పొరుగూరులో కాపురమున్నందు వలన ఈ విషయమును మండల రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకొని వచ్చుటకు ఫిర్యాదీ ప్రయత్నించినాడు. కానీ, మండల రెవెన్యూ అధికారి కూడా మచిలీపట్నములో నివాసము ఉన్నందున ఫిర్యాదీ ఫోనుద్వారా ఈ విషయమును తెలుపగా రాత్రికి రాత్రి అచటకు వచ్చుటకు వీలుపడదని మండల రెవెన్యూ అధికారి తెలిపినారు. అందువలన, ఫిర్యాదీ మరియు యితరులు విజయవాడ పోలీసు కమీషనరుకు ఈ విషయమై ఫిర్యాదు చేయగా, వారు ఈ విషయము రెవెన్యూ వారిది కనుక వారికే ఫిర్యాదు చేయాలి అని చెప్పి, ఒక కానిస్టేబులును లారీకి కాపలాగా యిచ్చినారు. పమిడిముక్కల మండలం రెవెన్యూ ఇన్స్పెక్టరు ఉయ్యూరులో కాపు రమున్నందున, వారికి తెలియచేయగా ఆయన వచ్చి పంచనామా చేసినారు. కానీ, ఆ అధికారి పంచనామా సరిగా చేయలేదు. అంతేకాక, రేషను షాపును కూడా తనిఖీ చేయక నిర్లక్ష్యముగా వ్యవహరించినారు. పై అధికారుల సూచనల మేరకు లారీని మండలరెవెన్యూ అధికారి కార్యాలయమునకు తరలిస్తున్నామనీ, సరకును తీసుకున్నట్లు మండల రెవెన్యూ అధికారి వచ్చిన తరువాత రసీదును యిస్తామని చెప్పి లారీని తీసుకువెళ్ళినారు. మరుసటిరోజు గ్రామప్రజల ముందు పంచనామా నిర్వహించినారు. కానీ పంచనామా కాపీలను ఫిర్యాదీలకు యివ్వలేదు. పమిడిముక్కల మండల రెవెన్యూ అధికారి దోషులతో చేతులు కలిపి, రికార్డులను తారుమారు చేస్తూ, వారికి సహకరిస్తున్నారు. బినామీ పేర్లతో చౌకడిపోలు యిచ్చుట, డ్వాక్రా గ్రూపులకు రేషను షాపులు తాత్కాలికముగా మంజూరు చేయుట, ఆదాయధ్రువీకరణ పత్రాలను అవినీతికి పాల్పడి యిచ్చుట మొదలగు అక్రమాలు చేస్తున్నారు.

ఈ సంస్థ జోక్యంచేసుకొని పమిడి ముక్కల మండల రెవెన్యూ ఆఫీసరు అవినీతి అక్రమాలపై విచారణ జరిపి, ప్రభుత్వము కేటాయించిన బియ్యము అక్రమపాలు కాకుండా చూడవలసినదిగా విజ్ఞప్తి.

ఈ ఫిర్యాదులో ఆరోపణలు చేయబడిన పై 1,2,3 ఉద్యోగులకు రూ.7,400/- పైబడి మూలవేతనము లేదు. అందువలన వారు లోకాయుక్త మరియు ఉపలోకాయుక్త చట్టములోని 2(ఐ) నిబంధన ప్రకారము ఆఫీసరు అనే నిర్వచనము క్రిందకు రారు. ఆఫీసరు కానివారు లోకాయుక్త చట్టములోని 2(కె) నిబంధన ప్రకారము పబ్లిక్ సర్వెంటు అనే నిర్వచనము క్రిందకు రారు.

ఆవిధముగానే, పైన చెప్పబడిన 4,5 వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగులు కానందువలన పబ్లిక్ సర్వెంటు అనే నిర్వచనము క్రిందకు రారు. పబ్లిక్ సర్వెంటు కాని వారి మీద చేయబడిన ఆరోపణలను విచారించే అధికారము లోకాయుక్త మరియు ఉపలోకాయుక్త చట్టము ప్రకారము ఈ సంస్థకు లేదు.

పై కారణముల చేత ఫిర్యాదీని ఈ సంస్థ ఎదుట హాజర్కై, ఈ ఫిర్యాదులో ఆరోపణలు చేయబడిన వారు ఈ సంస్థ పరిధిలోనికి ఏ విధముగా వస్తారో తెలియ చేయవలసినదిగా అతనికి 31.10.2003 తేదీ నాటి నోటీసు ద్వారా తెలియచేయబడినది. ఆ నోటీసును అందుకుని, ఫిర్యాదీ ఈ రోజు ఈ సంస్థ ఎదుట హాజర్కైనాడు. అయితే ఆయన చేసిన ఆరోపణలు లోకాయుక్త చట్ట పరిధిలోనికి ఏవిధముగా వస్తాయో చెప్పలేక పోయినారు. కానీ ఈ ఫిర్యాదులోని ఆరోపణలు వాస్తవములు కనుక ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించవలసినదిగా కోరినారు.

ఈ ఫిర్యాదులో ఆరోపణలు చేయబడిన ఏ వ్యక్తి కూడా లోకాయుక్త మరియు ఉపలోకాయుక్త చట్టము పరిధిలోనికి రారు. ఈ చట్ట ప్రకారము పబ్లిక్ సర్వెంటు కాని వారిమీద చేయబడిన ఆరోపణలను విచారించే అధికారము ఈ సంస్థకు లేదు. ఈ కారణము చేత ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించలేక పోతున్నాను. ఫిర్యాదీ పంపిన రూ.225/- లను మనిఆర్డరు రుసుము మినహాయించి, ఫిర్యాదీకి తిరిగి పంపవలసినదిగా ఈ సంస్థ కార్యాలయాన్ని ఆదేశించడమైనది.

Sd/
Lokayukta
14.11.2003

T/C
[signature]
Registrar